# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నం ఉక్కు కర్మాగారం పూర్వవైభవానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పునరుద్ఘాటించారు.**
2. **భారత్ 2047 నాటికి ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
4. **సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగించుకుంటోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక పింఛన్లు తొలగించారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం ఉక్కు కర్మాగారం పూర్వవైభవానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పునరుద్ఘాటించారు. విశాఖపట్నంలో ఆర్థిక వేత్తలు, వివిధ వర్గాల మేధావులతో కేంద్ర బడ్జెట్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ , దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారవేత్తలు, చార్టెడ్ అకౌంటెంట్స్, లాయర్లు, వ్యాపార సంఘాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి బడ్జెట్‌లో మార్పులు చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రతి ప్రాజెక్టుకూ కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని నిర్మలా సీతారామన్ తెలియజేస్తూ...

వాయిస్ ..35 సెకన్లు

---

భారత్ 2047 నాటికి ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి గత రాత్రి ఒక జాతీయ వార్తాఛానల్ నిర్వహించిన సమావేశంలో 'లిమిట్‌లెస్ ఇండియా' అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడారు. అంతర్జాతీయంగా భారతీయులు అనేకరంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా వారు అత్యంత ప్రభావం చూపే స్థితిలో ఉన్నారని చంద్రబాబు నాయుడు తెలియజేస్తూ...

వాయిస్ 27.. సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులపై ఫలప్రదమైన చర్చలు జరిగాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నిన్న కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర సామాజిక, ఆర్థిక, అభివృద్ధి ప్రాజెక్టుల గురించి చర్చించినట్టు తెలిపారు. ఇది రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహదపడుతుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు.

కాగా నిన్న విశాఖపట్నం పర్యటన ముగించుకొని ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రమంత్రితో సుమారు అరగంట పాటు చర్చలు జరిపారు. ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్నారు.

---

సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగించుకుంటోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. అమరావతిలో మంత్రి నిన్న మాట్లాడుతూ, సముద్రంలోకి పోయే ఈ వృధానీరు, వెనుకబడిన కరువు జిల్లాలు, రాయల సీమకు, ఫ్లోరైడ్ భాదిత ప్రకాశం జిల్లాకు వినియోగిస్తున్నామన్నారు. వీటిపై అభ్యంతరం సరికాదని అన్నారు. ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీల వరద నీరు సముద్రంలోకి వృథాగా పోతుందని, దానిలో 200 టీఎంసీల నీరు కరువు ప్రాంతాలకు తరలిస్తే ప్రాంతాలకు అతీతంగా స్వాగతించాలని తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం, సానుకూల వాతావరణంలో ప్రజా ప్రతినిధులు ఆలోచించాలని సూచించారు.

---

తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిన్న సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. క్యాబినెట్ నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వివరించారు. దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణాలో అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్..30 సెకన్లు

అలాగే యాదగిరిగుట్ట ఆలయానికి స్వయం ప్రతిపత్తి కల్పించేలా ప్రత్యేక ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఊతమిచ్చేలా ఇందిరా 'మహిళాశక్తి మిషన్-2025' విధానానికి మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం పేపర్ -2ఎ, బోటనీ పేపర్-2, సివిక్స్ పేపర్-2 పరీక్షలకు సెట్ నెంబరు 2 ప్రశ్నాపత్రం ఎంపిక చేశారు.

కాగా.. తెలంగాణాలో ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్లం పేపర్-1 పరీక్ష జరుగుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక పింఛన్లు తొలగించారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా రాష్ట్రంలో పింఛను లబ్దిదారుల అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు... మంత్రి సమాధానమిచ్చారు. 2019 జూన్ నాటికి 53 లక్షల 85 వేల 796 మంది పింఛన్ దారులు ఉంటే... ఇపుడు ఆసంఖ్య 63 లక్షల 59 వేల 9 వందల మందికి చేరుకుందన్నారు. అర్హులందరికీ పింఛను అందిస్తున్నామని మంత్రి వివరిస్తూ,

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

సమాచార, ప్రసార రంగంలో పనిచేసే మహిళా పాత్రికేయుల రక్షణ కోసం నూతన పాలసీని రూపొందిస్తామని తెలంగాణా రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మీడియా రంగంలో మహిళల్ని ప్రోత్సహించాలని అన్నారు. మహిళా సాధికారతను ప్రోత్సహించే విధంగా కథనాలు ప్రచురించాలన్నారు. మీడియాలో పనిచేసే స్త్రీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రి తెలియజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఈరోజు తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని 84 మండలాల్లో వడ గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, సీతంపేట మండలాల్లో తీవ్ర వడగాలులు వీస్తాయని తెలిపింది. మరోవైపు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఈరోజు వడగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

---------------------------

వస్తుసేవల పన్ను- జీఎస్టీ ఆదాయ విశ్లేషణపై ఏర్పాటైన మంత్రుల బృందాన్ని జీఎస్టీ మండలి పునర్వ్యవస్థీకరించింది. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ నేతృత్వంలోని ఈ మంత్రుల బృందంలో మొత్తం 9 మంది సభ్యులు ఉంటారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నారు. జీఎస్టీ వసూళ్లకు సంబంధించి విధానపరమైన జోక్యం అవసరమైనప్పుడు జీఓఎం సూచనలు చేస్తుంది. రాష్ట్రాల వారీగా జీఎస్టీ వసూళ్లు, రాబడి తీరును ఈ జీఓఎం పర్యవేక్షిస్తుంది.

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2024వ సంవత్సరం డిసెంబరు 7 నుంచి ఈ ఏడాది మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం

కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో  ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ వంద రోజుల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడం, సత్వర వైద్య సేవలను అందించడం, నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల కింద పౌష్టికాహారం అందించడం వంటివి నిర్వహిస్తారు.

======================